


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
సోమవారం 12 ఆగస్టు 2024 పేజీలు 8


# ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

**ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట - ఒంగోలు ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు**

**అట్టహాసంగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్యుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం**







ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ అన్నారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నగరంలోని ఎంహెచ్ఆర్ కళ్యాణ మండపంలో అటహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు టీజీ వెంకటేష్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిలు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఎప్పుడు ఆర్యవైశ్యుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేశారన్నారు. ఈ జిల్లాలో 80 శాతం పైగా ఆర్యవైశ్యులు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి పార్టీ అభివృద్ధిలో మంచి ఫలితాలను తీసుకురాగలగాలని అన్నారు. నూతన కార్యవర్గం ఆర్యవైశ్యుల అభివృద్ధికి పని చేస్తుందన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే మా దృష్టితో పాటుగా ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకురావాలని సానుకూలంగా సమస్యలు పరిష్కరించుకోవడానికి వీలవుతుందని తెలిపారు. నూతన కార్యవర్గానికి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్యవైశ్యులకు దిక్సూచిగా కొణిజేడు రోశయ్య నిలిచారని టీజీ వెంకటేష్ అన్నారు. ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్యలు వచ్చిన రోశయ్య సున్నితంగా పరిష్కరించారని తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య తనన శెట్టిగా అవర్ణించారని, ఎందుకంటే ఆర్యవైశ్యులతో అయిన సంబంధం తమ కుటుంబానికి ఉందని మాగుంట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన అధ్యక్షులుగా కోట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా ఆకుతోట శ్రీనివాసులు కోశాధికారిగా మొక్కల గడ్డ సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలోని ఆర్యవైశ్య ప్రముఖులు నూతన కార్యవర్గాన్ని దుశాల వాళ్ళతో ప్రత్యేకంగా అభినందించారు.

## అభివృద్ధి పనులు వేగవంతం

**రూ.8.26 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం**

**శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దామచర్ల, ఎంపి మాగుంట**

కొత్తపట్నం, మేజర్‌న్యూస్ : అల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లూరు గ్రామం నుండి ఆలూరు మీదగా చేజర్ల పోవుటకు ఆర్అండ్‌బి రోడ్డు నుంచి చేజర్ల మార్గంలో పంచాయతీరాజ్ రహదారిలో ముదిగొండ వాగుపై రూ.8.26 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరావులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా అభివృద్ధి చెందాలన్నా జరగాలన్న ఒక్క టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యపడుతుందని తెలియజేశారు. అలాగే మండలంలో మిగిలిపోయిన పంచాయితీ రోడ్లను కూడా పరిశీలిస్తున్నట్లు వారు తెలియజేశారు. గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం అభివృద్ధి చేయడంలో ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు షేక్ రియాజ్, బలగాని వెంకటేశ్వరరావు, జంపాని రామచంద్ర గౌడ్, గేనం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.






## నగరవాసులకు చేరువలో గుప్తాస్ గోల్డ్ హౌస్

**అట్టహాసంగా ప్రారంభించిన ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు**

ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలోని కర్నూల్ రోడ్డులో నూతనంగా నెలకొల్పిన గుప్తాస్ గోల్డ్ హౌస్ అట్టహాసంగా ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్, మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు హాజరైయ్యారు. షోరూంలోని వివిధ విభాగాలను అతిథులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నగర ప్రజలు విలువైన ఆభరణాలు కొనుగోలు చేసేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు నగరంలోనే గుప్తాస్ ఆధ్వర్యంలో బంగారు ఆభరణాల షోరూం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. గుప్తాస్ అంటేనే క్వాలిటీకి మంచి పేరుని అలాంటి సంస్థ బంగారు ఆభరణాల వ్యాపార రంగంలోకి వచ్చారని ప్రజలకు నమ్మకమైనటువంటి ఆభరణాలు అందుబాటులో ఉంటాయని నగర ప్రజలందరూ కూడా ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టిడిపి నాయకులు బండారు మదన్, తాతా ప్రసాద్, సిద్దా హనుమంతరావు, గుప్తాస్ గోల్డ్ హౌస్ యజమానులు వీరబాబు రాజు, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.



## సాగిరి సుబ్బారావు కు శుభాకాంక్షలు తెలిపిన తాండ్ర



బాపట్ల, మేజర్‌న్యూస్: హైదరాబాద్ లోని ఉప్పల్ ప్రాంతంలో గల భూలక్ష్మి నగర్ కాలని ఒనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోబడిన సాగిరి వెంకట సుబ్బారావు కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివ రావు.ఆంధ్రప్రదేశ్ లోని కర్లపాలెం మండలం నల్లమోతు వారి పాలెం గ్రామానికి చెందిన ఒక సాదారణ కుటుంబంలో జన్మించి గ్రేటర్ హైదరాబాద్ లో విద్యావంతులు అత్యున్నతమైన హొదాలు కలిగిన వ్యక్తులు, ఉద్యోగస్తులు ఉండే ఒక కాలని కి ప్రెసిడెంట్ గా ఎన్నుకోబడటం సామాన్య విషయం కాదు అని అలా అందరూ కలిసి ఎన్నుకున్నారు అంటే నిలోని మంచితనానికి, నీతి నిజాయితీలకు కి నిదర్శనం అని ఎంపీటీసీ తాండ్ర కొనియాడారు. నిజంగా ఒక సోదరుడిగా నీకు మన స్ఫూర్తిగా దీవెనలు శుభాకాంక్షలు తెలియజేస్తూ న్నాను అని తెలియజేసి, ఒక మంచి మనసున్న వ్యక్తి నీ గుర్తించి కాలని ప్రెసిడెంట్ గా ఎన్నుకున్న భూలక్ష్మీ నగర్ కాలని వాసులకు అందుకు సహకరించిన స్థానిక కార్పొరేటర్ బొడిగే కృష్ణా గౌడ్ కి ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎస్ఐ తిరుమల రావు బాధ్యతలు



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: మండల కేంద్రం నిజాంపట్నం పోలీస్ స్టేషన్ కి నూతన ఎస్సైగా కె. తిరుమల రావు ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. నిన్నటి వరకు ఇక్కడ ఎలక్షన్ విధులు నిర్వహించిన ఎస్సై శ్రీనివాసరావు బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. బాపట్ల జిల్లా పొంగులూరు ఎస్సైగా ఎలక్షన్ విధులు నిర్వహించి సాధారణ బదిలీలో భాగంగా నిజాంపట్నం వచ్చినట్లు ఎస్సై తిరుమలరావు చెప్పారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలం దరికీ అందుబాటులో ఉండి వివిధ సమస్యలపై వచ్చిన వారికి న్యాయపరంగా పరిష్కరిస్తానన్నారు. అంతేకాక మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాపు సారా తయారు చేసిన అమ్మిన నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## కుప్పకూలిన వంతెన నిర్మించేది ఎప్పుడు



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: నిజాంపట్నం నుండి రేపల్లె, మట్లపూడి మూడు రహదారులకు ప్రధాన కూడలి వంతెన కుప్ప కూలింది ఈ వంతెన పడిపోయి వారం రోజులు గడుస్తున్నా ఆర్ అండ్ బి అధికారులు వంతెన నిర్మాణము కానీ లేక మరమ్మత్తులు కూడా చేయ కపోవడం వాహనాదారులకు ఇబ్బందిగా మారుతు ంది. వివరాల్లోకి వెళ్తే నిజాంపట్నం నుండి రేపల్లె మార్గమధ్య అంటే మట్లపూడి వంతెనఅని పిలుస్తారు. మూడు ప్రధాన రహదారులకు ఆ ఒక్క వంతెన మీద నుండి బైకులు, కార్లు, బస్సులు ,ఆటోలు ,పాదచారులు రోజులో కొన్ని సంవత్సరాల వందల వాహనాలు వంతెనపై వెళ్లి గమ్యం చేరుకుంటారు. ఈ తరుణంలో గత వారం రోజుల క్రితం ఆ వంతెన కుప్ప కూలింది. వంతెన పక్కనే చిన్న రహదారి ఉండటంతో ఆ దారి పైనుండి వాహనాలు ఇబ్బందులు పడుతూ వెళ్ళవలసి వస్తుంది. దానికి కూడా ప్రమాదం పొంచి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు త్వరలో ఆ వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని ఆయా పరిసర ప్రజలు కోరుచున్నారు.

# ఇండియన్ జుడీషియల్ సర్వీసెస్ ద్వారానే న్యాయ మూర్తుల ఎంపిక చేయాలి



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ ద్వారానే న్యాయమూర్తుల ఎంపిక చేయాలని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు దేశ ప్రధాని మోడీకి లేఖ వ్రాశారు.ఆదివారం ఈ సందర్భంగా భట్టిప్రోలు ఆయన మాట్లాడుతూ దేశంలో 1950 లో సుప్రీంకోర్టు ఏర్పాటు జరిగినదని,1980 వరకూ అనగా 30 సంవత్సరాల కాలంలో ఒక్క బిసి,దళిత వర్గాలకు చెందినవారు ఒక్కరికీ కూడా సుప్రీంకోర్టులో జడ్జిలుగా అవకాశం దక్కలేదన్నారు. 1983లో కేంద్రంలో న్యాయశాఖా మంత్రి గా పి శివశంకర్ అనేక సంస్కరణలను అమలు చేశారు,అందువల్లే సుప్రీంకోర్టు,హైకోర్టు న్యాయమూర్తు లుగా బిసి,దళిత వర్గాలకు చెందిన వారు ఎంపికైయ్యారన్నారు. అనేక రాష్ట్రాల్లో సిఎం బంధువుల కులానికి చెందినవారు హైకోర్టులో జడ్జ్ లుగా ఎంపికైనారని, అందుచేత ఇండియన్ జుడీషియల్ సర్వీసెస్ ద్వారా ఎంపికైన వారికి సుప్రీం కోర్టు, హైకో ర్టు,జిల్లా జడ్జ్ లుగా నియా మకం చేయాలని శ్రీనివాస రావు ప్రధాని మోడీ కి వ్రాసిన లేఖలో పేర్కొ న్నారు.అప్పుడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కలలు సాకారం చేసేందుకు అవకాశం ఉంటుందని వేల్పూరి పేర్కొన్నారు. ఆత్మగౌరవం కోసం, సామాజిక న్యాయం కోసం శివశంకర్ చేసిన పోరాటం చరిత్రలో గొప్పదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని మోడీకి విజ్ఞప్తి చేశారు. తెలుగు రాష్ట్రాలలో కేవలం ఒకటి రెండు కులాలు న్యాయ వ్యవస్థను కబ్జా చేశారని,జగన్ 10 సంవత్సరాల నుండీ కోర్టుకు వెళ్లకుండా బయట ఉండటమే దానికి నిదర్శనమని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొలీజిఎం వ్యవస్థ ద్వారా జడ్జిల ఎంపిక సరికాదన్నారు. పారదర్శకత కోసం, అందరికీ న్యాయం కోసం ఇండియన్ జుడీషియల్ సర్వీసెస్ ప్రవేశపెట్టి న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

# చర్చి నిర్మాణానికి టీడీపీ శ్రేణుల విరాళం



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు శివారు అద్దేపల్లి గ్రామ దళితవాడలో ఆంధ్రా క్రీస్తు లూదరన్ చర్చి పునఃనిర్మాణం నిమిత్తం రాష్ట్ర తెలుగు యువత అధి కార ప్రతినిధి శ్రీ డాక్టర్ కనగాల మధుసూధనప్రసాద్ మరి యు వేమూరు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు బట్టు మల్లిఖార్జునరావు, రాష్ట్ర యస్సీ సెల్ కార్యదర్శి కనపర్తి సుందరరావు,వేమూరు నియోజకవర్గ యస్సీ సెల్ ఉపాధ్య క్షులు జంగం శ్యాంసన్,భట్టిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ మా జీ మండల కన్వీనర్ కరుణ శ్రీనివాసరావు, వేమూరు తెలుగు యువత ఉపాధ్యక్షులు గొట్టుముక్కల లెనిన్, వేమూరు నియోజకవర్గ యస్సీ సెల్ కార్యదర్శి సురేంద్రకుమార్ పోకూరి తదితరులు నూతన చర్చి పునః నిర్మాణ పనులను పరిశీలించారు. జరుగుతున్న చర్చి పునః నిర్మా ణం నిమిత్తం డాక్టర్ కనగాల మధుసూధన్ ప్రసాద్ ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమములో అద్దేపల్లి పారిస్ చర్చి ఫాస్టర్ మద్దిరాల ఆనందరావు,సంఘ పెద్దలు చీకటి మరియ దాసు,పప్పల ప్రసాద్,నీలా డేవిడ్,కామాల శ్రీను, కంభం రమేష్,కనపర్తి సురేష్,కసుకుర్తి భాస్కరరావు,పప్పల మనోజ్, కనుమూరి సంసోన్,కసుకుర్తి దుర్గరావు తదితరులు పాల్గొ న్నారు. తదనంతరం స్థానిక ఫాస్టర్ గారైనా ఆనందరావు నూతన చర్చి పునః నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసిన డాక్టర్ మధుసూదన ప్రసాద్ ను ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు.

# యుటిఎఫ్ స్వర్ణోత్సవ పతాకావిష్కరణ వేడుక



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని స్థానిక యుటిఎఫ్ భవన్ ప్రాంగణంలో యూటీఎఫ్ స్వ ర్ణోత్సవ కార్యక్రమాలలో భాగంగా స్వర్ణోత్సవ పతాకావిష్కరణ నిర్వహించబడినది.యుటిఎఫ్ భట్టిప్రోలు మండలశాఖ అధ్యక్షుడు వి సురేష్ కుమార్ మరియు ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, సూరేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎస్ఎం ఆలీ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,వెల్లటూరు జీవశాస్త్ర ఉపాధ్యాయులు కే.శివరా మ కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జరిగిన సభలో కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ"అధ్యయనం- అధ్యాపనం-సామాజిక స్పృహ" యుటిఎఫ్ నిర్మాణానికి ప్రధాన భూమి కలని అభివర్ణించారు.సురేష్ కుమార్ ప్రసంగిస్తూ విద్యారంగ పరిరక్షణ మరియు ఉపా ధ్యాయ సంక్షేమం యుటిఎఫ్‌కు రెండు కళ్ళ వంటివి అని సమ సమాజ నిర్మాణానికి రేపటి పౌరులను తీర్చిదిద్దటమే కామ్రేడ్స్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సభకు హాజరైన సభ్యులు యుటిఎఫ్ ఉద్యమ పందా,దాని ఎర్రజెండా, చిరస్థాయిగా ఉండాలని పిడికిలి బిగించి నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యా కేంద్రం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ




బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధి లక్షంగా గడచిన నాలుగు సంవత్సరాలుగా సాయంకాల సమయములో అధ్యాపకులచే తరగతులు నిర్వహించ బడుతున్న ఎస్ టు నీడి ఫౌండేషన్ గ్రామీణ విద్యా కేంద్రము నందు గల కిశోర బాల, బాలికలకు స్కూల్ బ్యాగ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట సురేష్ బాబు మాట్లా డుతూ గ్రామీణ విద్యార్థుల ను నేటి పోటీ ప్రపం చానికి సమాయత్త పరచడములో, దినసరి ఆదాయం , చేతి వృత్తు లపై ఆధారపడిన తల్లి తండ్రులు వారి పిల్లల బంగారు భవి ష్యత్తు పట్ల ఉన్న ఆకాంక్షను నెరవేర్చడములో మా వంతు పాత్రను పోషించడానికి, చదు వు ద్వారా వచ్చే జ్ఞానము భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడ టానికి మాత్రమే కాకుండా, సమాజానికి బాధ్యత గల యువతను అందించేదిశలో విద్యాభోదన నిర్వహి స్తున్నా ము అని తెలియచేశారు. ఈ కార్యక్రమములో సంస్థ డైరె క్టర్ సురేష్ బాబు తోట, స్థాని కులు గోగు శివ, సిరిపిల్లి సత్య వతి, పీక్కి కుమార్, చోడిపిల్లి భాగ్యవతి, తిర్రి ద్రాక్షా వలి, ఎరిపిల్లి కొండమ్మ, దోనీ భాను, చోడిపిలి గురయా మా, చోడిపిల్లి కాశయ్యతదితరులు పాల్గొన్నారు..

# హలో మాదిగ - ఛలో హైదరాబాద్ జయప్రదం చేయండి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మాదిగ సోదరులకు బంగారు భవిష్యత్తుకు అలుపెరుగని పోరాటం చేసి యస్సి వర్గీకరణ సాధించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అధ్వర్యంలో ఈనెల 13వ తేది మంగళవారం హైదరాబాదులో జరిగే విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జెపి రాజు మాదిగ విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పలుగ్రామాలలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మాదిగ సోదరులను కలిసి అవిశ్రాంత పోరాటం చేసి యస్సి వర్గీకరణ సాధించిన మంద కృష్ణమాదిగ అధ్వర్యంలో జరిగే విజయోత్సవ ర్యాలీలో మండలం నుండి భారీసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

## 10 మంది లజూదరులు అరెస్ట్

**- రూ.85,670లు నగదు స్వాధీనం**



కనిగిరి, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కనిగిరి డి.ఎస్.పి ఆర్.రామరాజు, సీఐ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని బడుగులేరు గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై టి.త్యాగరాజు తెలిపారు. వారి వద్ద పేక ముక్కలు, 85670 రూపా యల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పేకాట, కోడి పందా లు, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి వారి వివరాలను కనిగిరి పోలీసు వారికి తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

## ఎస్ఎంసి చైర్మన్ 'రమేష్'కు సత్కారం



చీమకుర్తి, మేజరన్యూస్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన మా ఆత్మీయ మిత్రులు చలువాది రమేష్‌కి ఆర్యవైశ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో చిరు సత్కారం జరిగింది. ఈ సందర్భంగా చలువాది రమేష్ మాట్లాడుతూ తను బాల్యంలో చదువుకున్న పాఠశాలకే నేడు పాలకమండలి చైర్మన్ అయిన సందర్భంగా బాల్యమిత్రులు సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. మిత్రులందరి సహకారంతో హైస్కూల్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో ఏఎంసి మాజీ డైరెక్టర్ ఆలపాటి నరసింహారావు, పల్లపోతు శంకర్ బాబు, మద్ది రమేష్ బాబు, టెక్స్టైల్స్ డిపార్ట్మెంట్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ కొంకిమళ్ళ చంద్రమౌళి, తాళ్లూరి చలపతిరావు, బొమ్మిశెట్టి సత్యం, నేరెళ్ల సుబ్రహ్మణ్యం, తాళ్లూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించండి



ఒంగోలు, మేజర్‌న్యూస్ : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించండి - రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఇస్లాం పేటలో సీనియర్ ముస్లిం నాయకులు సయ్యద్ సర్దార్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిసారి నుంచి అనేక ముస్లిం వ్యతిరేక చట్టాలు రూపొందించడంతోపాటు ముస్లింల మీద పెద్ద ఎత్తున భౌతిక భావజాలపరమైన దాడులు ప్రభుత్వ పెద్దల కనుసన్నెలలో జరుగుతూనే ఉన్నాయి. మైనార్టీ ప్రజలు ప్రజాస్వామికవాదులు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, మైనార్టీల పట్ల వ్యవహరిం చదల్చుకున్న వైఖరిని అమలు చేస్తూ ముందుకు సాగుతూనే కేంద్ర ప్రభుత్వం ఈ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకుని వచ్చిందని, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. లక్షలాది ఎకరాల ఉన్న వక్ఫ్ భూముల పెద్ద ఎత్తున అన్యాక్రాంతమవుతున్నా వాటిని కప్పిపుచ్చి అనేక కట్టు కథలతో వక్ఫ్ మీద అనేక అనుమానాలు కలిగించేలా రకరకాల దుష్ప్రచారాలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ బోర్డు విధానాన్ని కొనసాగించాలని. ఈ కార్యక్రమానికి ముస్లిం విద్యావేత్త న్యాయ వాది షేక్ కరిముల్లా సమన్వయ కర్తగా వ్యవహరించారు. ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, పఠాన్ కరిముల్లా ఖాన్, సయ్యద్ హుస్సేన్, షేక్ ఖాజా, మహమ్మద్ సాదిక్, నూకతోటి రవికుమార్, అబ్దుల్ రవూఫ్, కరీమ్ బేగ్, న్యాయవాదులు షేక్ సందాని, అబ్దుల్ నబీ. ఆరీఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజారావును అభినందించిన ప్రకాశం జిల్లా ఆర్డబ్ల్యూఎస్, సిపిడబ్ల్యు వర్కర్స్ యూనియన్

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన వినుకొండ రాజారావుకి ప్రకాశం జిల్లా ఆర్డబ్ల్యూఎస్, సిపిడబ్ల్యు వర్కర్స్ యూనియన్ అభినందనలు తెలియజేశారు. విజయవాడలో హెడ్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో రాజారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నాయకులు మల్లికార్జున్, వీరబ్రహ్మం,రవి, నారాయణ, చిరంజీవి తదితరులువినుకొండ రాజారావుని ఘనంగా సన్మానించారు.



## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

### నగర ట్రాఫిక్ సిఐగా వై.పాండురంగారావు బాధ్యతలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: వాహన దారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఒంగో నగర ట్రాఫిక్ నూతన సిఐ వై. పాండురంగారావు సూచించారు. ఆదివారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర ప్రజానీకానికి పలు సూచనలు చేశారు. ఒంగోలు నగరంలోని త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలను, నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలను,ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్న ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని, అలాగే వాహనదారుల లైసెన్స్‌లను తనిఖీ చేసి, లైసెన్స్ లేని వారికి నెంబర్ ప్లేట్స్ లేని వాహనదారులకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. త్రిబుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ వాహనాలు వలన చాలా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. ఆటోలు విధిగా పోలీస్ ఐడెంటిఫికేషన్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. ప్రధాన రోడ్లపై ఆవులు పడుకోవడంతో వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, పశువుల యజమానులు అవులు రోడ్లపై తిరగకుండా చూడాలన్నారు. వాహనాల నెంబర్ ప్లేట్లు యం.వి యాక్ట్ నిబంధనల ప్రకారం ఉండాలని, భయంకరమైన సౌండ్స్ వచ్చే మాడిఫైడ్ సైలెన్సర్‌లు, సైరన్స్ అమర్చి శబ్ద కాలుష్యం సృష్టించడమే కాకుండా ఇతర వాహనదారులు, ప్రజలకు అసౌకర్యాన్ని, భయాన్ని కల్గిస్తే చర్యలు తప్పవని, సైలెన్సర్ అమ్మే వాళ్ళ పైన బిగించే మెకానికుల పైన కూడా చర్యలు తీసుకుంటామని, అతి వేగం, మద్యం సేవించి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు హాని కలిగించవద్దని సూచించారు. పట్టణ ప్రజలందరూ ట్రాఫిక్ విషయంలో రూల్స్, రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలని తెలియజేశారు.

**పోటీపరీక్షల ప్రత్యేకం**

# మానసిక బలహీనులు



**మానసిక బలహీనులు లక్ష్యాన్ని సాధించలేరా..? మానసిక బలవంతులులే లక్ష్య సాధకులా...? ఏ మానసిక బలహీనత లేని వారు ఈ భూ మండలముపై ఉన్నారా..? అసలు హండ్రెడ్ పర్సంట్ మానసిక బలవంతులు ఉంటారా..? అంటే ఏ బలహీనత లేని వారన్నమాట....? ఏమో చూద్దాం!**

వందకి వంద శాతం నిఖార్సయిన మనిషి ఉండడు. ఖచ్చితంగా వారికి ఏదో బలహీనత ఉంటుంది. ఆ బలహీనత అతనిని లేదా అతని లక్ష్యాన్ని లేదా జర్నీని దెబ్బ తీసేదయితే ఆ బలహీనతను నూటికి నూరుపాళ్ళు నాశనం చేయవలసినదే. అదెలాగంటే మనం గట్టిగా మనసులో అనుకుంటే అది ఖచ్చితంగా పోతుంది.

**బలహీనతలకు గండి కొట్టాలి....**

మంచి వయసులో పిల్లలు చదువుకొని ప్రయోజకు లయ్యే దశ. ఈ దశలో ఉక్కిరి బిక్కిరి చేసే అనేక బలహీనతలు. లొంగిపోయామా... జీవితం నాశనం. ఆ నాశనం అన్న విషయం అప్పుడు తెలియదు – ఓ పదేళ్ళ తదుపరి ప్రశాంతంగా తెలుస్తుంది. ఆది దశలోనే మనం మన బలహీనతలకు గండి కొడితే అది ఉప్పెన మాదిరి అయి అందులో మనం కొట్టుకు పోకుండా ఉంటాం.

**తల్లిదండ్రులూ కారణమే...**

ముఖ్యంగా పిల్లలు చెడిపోతున్నారు అంటే నాకు తెలిసిన మేరకు కారణం మొదటి మెట్టు తల్లిదండ్రులు. వారికి చెందిన అతిప్రేమ. ఈ అతి ప్రేమను జనాలు చూస్తున్నారని చూపిస్తారో? మరి సహజ సిద్ధంగా ఉండే ప్రేమను చూపిస్తారో తెలియదు గాని దీనితో పిల్లలను చెడగొట్టడం ఖాయం. ఈ రోజుకి చాలామంది తల్లిదండ్రులకి తమ బిడ్డకు ఏదిష్టమో, ఏ కోర్సు ఇష్టమో కూడా తెలియదు. ఆ! డబ్బులున్నాయి, వారే చదువుతారు, మరో కాలేజీలో చేర్పిస్తే సరి! వాళ్ళని, వీళ్ళని చూసి చదువుకొని బాగుపడతారులే... అనుకుంటారు. కానీ అది జరగదు. డబ్బులుపోతాయి. విలువైన కాలం పోతుంది, పిల్లల కెరీర్ కూడా పోతుంది. కనుక తల్లిదండ్రులు ఈ బలహీనతను జయించాలి.

**యుక్త వయస్సులో జాగ్రత్త.....**

ఇక యుక్త వయస్సు నాటికి అనేక సమస్యలు చుట్టుముడతాయి. కొన్ని గోప్యంగా ఉండాల్సిన అంశాలు కూడా ఉంటాయి. వాటిని బహిరంగ పరచవలసిన అవసరం లేదు. కాలానుగుణంగా అవి జరిగిపోతుంటాయి. కానీ నేటి సామాజిక మాధ్యమాలు వానిలోని గోప్యతను బట్టబయలు చేస్తున్నాయి. దీనివల్ల పవిత్రత అనే పదం పోయి పాపం మూట కట్టుకోవలసిన పరిస్థితి. దీంతో సినిమాల్లోలాగా, టీవీ సీరియళ్ళలాగా, వెబ్ సీరీస్‌లో లాగా ఓటీటీల్లాగా జీవితం ఉంటుందని అభంశుభం ఎరుగని పిల్లలు వాటిపట్ల ఆకర్షితులు అయి తరువాత తనువులు చాలిస్తున్నారు. కనుక ఇక్కడ కూడా తమ బిడ్డలకు తెలియకుండా తల్లిదండ్రులే కొంత కాలం సిఐడి పాత్ర పోషించవలసి ఉంది. ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి, ధృవీకరించుకోవాలి. అపుడే వారిని గాడిన పెట్టిన వారమవుతాం. ఎవరి బిడ్డలు వారికి ప్రాణం, ప్రేమ.. ఇది నిజమే. కానీ రేపు ఆ ప్రాణాలే పోతే?

**కోపాన్ని జయించాలి....**

ఇక నేడు మనం అందరం ఎదుర్కొంటున్న అతిపెద్ద బలహీనత కోపం. మనిషికి సమస్యలు ఎక్కువయినపుడు, లేదా పని ఒత్తిడి తీవ్రం అయినపుడు కోపం వస్తుంది. కానీ కోపం వచ్చినపుడు మనమందరం చూడటానికి అసలు బాగోము. మీరు కోపంగా ఉన్నపుడు ఒకసారి అద్దంలో చూసుకోండి. ఎంత అసహ్యంగా ఉంటామో! అవునా? కాదా? కనుక మనకు కోపం వస్తుంది అని తెలుసుకునేలోపే విచక్షణ, విజ్ఞానంతో దాని పీక పిసికేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అంటే సర్వకాల సర్వావస్థలందు కోపం పనికిరాదు. కోపం మనకీ మంచిది కాదు. ఎదుటివాళ్ళకీ మంచిది కాదు. దీనివల్ల సంబంధాలు దెబ్బతింటాయి. విపరీతమయిన కాల హరణం అవుతుంది. పనికి మాలిన హడావుడి, బీపీలు, షుగర్‌లు పెరగడం తప్ప ఏముంటుంది కోపంలో. కనుక కోపం అనే నరాన్ని తెంపేయండి. అలాగని గోవులా ఉండమని కాదు. మన హక్కు అన్నపుడు పోరా డవలసిందే. ఈ కోపం అవసరమే! కానీ ప్రతిదానికి కోపం అనే ఆయుధం వాడితే కోపిష్టి, ముక్కోపి అనే పదాలు ప్రాచుర్యం పొంది మన దగ్గరకు వచ్చేవారు ఒక పద్ధతి ప్రకారం దూరం అవుతారు.

**జిహ్వా చాపల్యం తగ్గించుకోవాలి...**

మనలోని మరో బలహీనత ఏదిపడితే అది తినేయడం. రోడ్డుపై మనం వెళ్తున్నపుడు వేడివేడి నూనెలలో మరుగుతున్న మిర్చీలు, పునుగులు, గారెలు ఇలాంటివి ఆకర్షించినంతగా అదే రోడ్డుపై ఉండే ఫ్రూట్స్ ఆకర్షించవు. వీటికి పెట్టే ఆ పది రూపాయలు పండ్లకి పెడితే పోషకాలు వస్తాయి. కానీ నాలిక బలహీనత వల్ల ప్రాణం బజ్జీల వైపే పీకుతుంది. తినేదాక ఆగదు. ఆ తరువాత ఇదే పద్ధతి కొనసాగించడం వల్ల ఫ్యూచర్‌లో ఎక్సరేలు, హాస్పిటల్స్ తప్ప మరేమీ కానరావు. నిజానికి నేడు మనం మనకు కావలసిన కేలరీల కన్నా ఎక్కువ కేలరీల ఫుడ్ లాగించేస్తున్నాము. రుచి అనేది నాలిక చివరి వరకే. మిషన్‌లోకి పోయిన తరువాత అంతా ఒకటే. కనుక మిర్చి కొనాలా? మ్యాంగో కొనాలా? అనేది మన విచక్షణ. ఎవరూ ఎవరినీ ఇక్కడ బలవంతం పెట్టరు కదా! మనిష్టం. రేపటి మన కర్మకు ఇది ఇష్టం.

**ఎదుటివారిని చులకనగా చూడవద్దు....**

మరి కొంతమందికి ఎదుటివారిని ఏడిపించే బలహీనత. ఎదుటివారి ఏడుపులో వీరు సంతోషం వెతుక్కుంటారు. ఇదొక మాయరోగం. ఇలాంటి వారు ఎదుటివారి బలహీనతలను చెప్పుకుంటూ, పదే పదే జనాల్లో వారిని చులకన చేస్తూ అదో స్కీం లాగా పనిచేస్తూ ఉంటారు. మరి వీళ్ళు ఎలా బతుకుతారు? ఏ పని చేసి బతుకుతారు? అంటే, బేసికల్లీ వీరు పరాన్న జీవులు. పారాసైట్స్. ఇంట్లో ఎవరో ఒకరు గొడ్డుచాకిరి చేస్తూ సంపాదిస్తుంటే ఆ డబ్బులతో దేశం పై బడి ఇలా ఎవరినో ఒకరిని ఏదో ఒకటి కామెంట్ చేస్తూ బతికేస్తుంటారు. కొన్నాళ్ళకి వీళ్ళకి పిచ్చి పట్టిందని జనాలు దూరం పెడతారు. ఆ తరువాత వారికి నిజంగానే పిచ్చి పడుతుంది. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదుటివారి గురించి చులకన చేయటం గాని చులకనగా చూడడం కానీ చేయవద్దు. ఇందాక మనం చెప్పుకున్నట్లే ఇదొక మాయరోగం.


మరికొంతమంది తాము మానసికంగా అపర బలవంతులమని చెప్పుకుంటారు. ఇది కూడా ఒక రకంగా బలహీనతే. అస్సలు మనలను మనం ఎక్కువగా అంచనా వేసుకుంటాం. ఒకటేమిటి? అన్ని రకాలు గానూ. అంచనాలను రీచ్ కాలేక దుఃఖం ఒడిలోకి చేరి పోతాం. ముందు మనమేంటో మనకు తెలియాలి. వేరే వారికి కానే కాదు. వేరేవారికి మనబలం, బలహీనతలు తెలుస్తున్నాయంటే మన పరిస్థితి శృతి మించినట్లేనని గుర్తించండి. తక్కున మనం మారాలి. మార్చుకోవాలి. లేదా పదిమందిలో అల్లరయిపోమూ? మనకి ఎంత తెలిసినా, ఎదుటివారికి ఎంత తక్కువగా తెలిసినా, మనం వినాలే కానీ డాంభికం వద్దు. ఎందుకు వినాలి? అని మీరు అడగవచ్చు. వినాలి అంతే. లేదా అక్కడికి వెళ్ళవద్దు. దూరంగా ఉండండి.

మనం ఇలా అనుకోవాలి–**మనం గొప్పవాళ్లం కాదు. కానీ గొప్ప వాళ్ళం అవడానికి ప్రయత్నించాలి. అలాగే మనం మేథావులం కాదు, కానీ మేథావులు కావడానికి యత్నించాలి. బేసికల్‌గానే మనం మంచివాళ్ళము కాదు, మంచివాళ్ళలాగా కావడానికి ప్రతిరోజూ ప్రయత్నిస్తూనే ఉండాలి.** రూసో అనుకుంటాను...ఆయన ఎక్కడో ఇలా అన్నారు

**“మనుషులందరూ చెడ్డవాళ్ళే! అవకాశం రాక మంచివారిగా మిగిలిపోతు న్నారు”.** నేనంటా ను **మనుషు లందరూ మంచి వాళ్ళే అవకాశం వచ్చి చెడ్డవాళ్ళుగా మారుతున్నారు!!**

# అన్న ఆశయాలకు తమ్ముడు ముందడుగు

- అన్న సిద్ధాంతం కోసం కట్టుబడి ముందుకెళ్తున్న తమ్ముడు
- సొంత వ్యాపారాలు సైతం పక్కన పెట్టేసి ప్రత్యక్ష రాజకీయంలో
- పామూరు మండలాన్ని భుజాన వేసుకొని నేనున్నానంటూ కార్యకర్తలకు భరోసా ఇస్తున్న పువ్వాడి
- తన అన్న నమ్మిన ఆశయాలు నెరవేర్చడమే తన ఏకైక లక్ష్యం
- సేవ చేయాలనే తపన సంపాదించుకోవాలి అనే తపన లేని నాయకుడు
- పామూరులో మచ్చలేని బ్రాండ్ ఆ బ్రాండ్ పేరు పువ్వాడి
- టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లును అభినందిస్తున్న కార్యకర్తలు



పామూరు, మేజర్‌న్యూస్: నాటి సమాజంలో అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న సంపాదిం చుకోవాలనే తపన పడుతుం టారు. సంపాదించడం కాదు ప్రజలకు సేవ చేసి అందరి చేత మన్ననలు పొందటమే తన ధ్యేయంగా భావించి పామూరు మండలంలో ఒక బ్రాండ్ పేరు సంపాదించుకున్న స్వర్గీయ తన అన్న పేరు నిలబెట్టేందుకు తమ్ముడు గత 10 ఏళ్ల నుంచి అన్న ఆశయాలు పూరిం చేందుకు నేనున్నానంటూ ముందడుగు వేస్తున్నాడు.. ఆ తమ్ముడు ఎవరో కాదు స్వర్గీయ టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి రాధాకృష్ణ సోదరుడు పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు....



పువ్వాడి కుటుంబం అంటే ఒక బ్రాండ్ నలుగురికి సహాయం చేయడమే వారి నైజం కీడు చేసే నేతలు కారు అంటూ మండలంలో అందరి నోటా వినబడుతున్న మాట. తన అన్న పువ్వాడి రాధాకృష్ణ నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి అందరి హృదయాలనుంచి వెళ్లిపోయిన నేపథ్యంలో అన్న ఆశయాలను నెరవేర్చినందుకు తమ్ముడు టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి నేటి వరకు కార్యకర్తలకు ఎల్లవేళలా నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ ముందుకు వెళుతున్నారు.. కర్నూలు జిల్లాలో ఉన్న వ్యాపారాలను సైతం పక్కన పెట్టి సొంతం మండలంలో గత పది సంవత్సరాల నుంచి పువ్వాడి వెంకటేశ్వర్లు కార్యకర్తలకు దగ్గరగా ఉంటూ భరోసా ఇస్తున్నారు. దాంతో ఏ గ్రామంలో చూసినా పువ్వాడి వెంకటేశ్వర్లు కార్యకర్తలు జై కొడుతున్నారు. సొంత ప్రయోజనాల కంటే తెలుగుదేశం పార్టీ ప్రయోజనాలే మిన్న అంటూ సొంత వ్యాపారాలను సైతం పక్కనపెట్టి నిరంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉండడంతో గ్రామాల్లోని పార్టీ శ్రేణుల్లో ఉత్తేజ ఉరకలేస్తుంది.

# సిమెంట్ రోడ్లకు ఐదుకోట్లు మంజూరు

- త్వరలో పామూరు పట్టణంలో ఆక్రమణలు తొలగింపు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర



పామూరు, మేజర్‌న్యూస్: మండలంలోని పలు గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న రహదారులను సిమెంట్ రోడ్లుగా మార్చేందుకు ఐదు కోట్ల నిధులతో సిసి రోడ్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందని ట్రాఫిక్ సమస్య నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలలో ఆక్రమణలో ఉన్న షాపులను త్వరలో తొలగించడం జరుగుతుందన్నారు. జైకో నిధులతో జరుగుతున్న మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులలో జంగిల్ క్లియరెన్స్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రిజర్వాయర్ పనులలో ఆలసత్వం వహిస్తే కాంట్రాక్టర్ ను తొలగించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బొల్లా నరసింహారావు, యారవ శ్రీనివాసులు, యారవ ప్రసాద్ రెడ్డి, షేక్. గౌస్ బాషా, ఉప్పలపాటి హరిబాబు, యిర్రి కోటిరెడ్డి, డోలా శేషాద్రి, కాజా రహమతుల్లా, సంధాని బాషా, ఎలమందల కరీముల్లా, ఎర్రసింగు ముసలయ్య, కల్లూరి తిరుపతయ్య, మన్నం రమణయ్య, గుత్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బిఎన్‌ను కలిసిన తాహసిల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు,మేజర్‌న్యూస్: ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం సంతనూతలపాడు నూతన తాహసిల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## చిన్నారులను ఆశీర్వదించిన మంత్రి స్వామి

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని దావ గూడూరు గ్రామంలో పూరిమల్ల వెంకటస్వామి కుమారులైన చిరంజీవి వెంకట ప్రవీణ్‌లకు పంచ కట్టు కార్యక్రమం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంకు రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. తొలుత చిరంజీవి వెంకట ప్రవీణ్‌లకు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పోకూరి రవీంద్రబాబు, గ్రామ టిడిపి నాయకుడు, మాజీ సర్పంచ్ కంచల రామకృష్ణ పాల్గొన్నారు.



## ఎస్టీ కుటుంబానికి ఆర్థిక చేయూత

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన జగన్నాథం వెంగమ్మ కుమార్తె లక్ష్మీ వివాహం సందర్భంగా జిల్లా వైయస్ఆర్ టియుసి అధ్యక్షుడు మేకల చినతిరపతయ్య యాదవ్(బాలు) పదివేల రూపాయలు నగదు వస్త్రాలు బహూకరించారు. ఆదివారం స్థానిక గంగమ్మతల్లి దేవస్థానం ఆవరణలో పూజలుచేసి అనంతరం పెండ్లికుమార్తె లక్ష్మీకి నగదు వస్త్రాలు అందజేసి ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల బాలు, యన్.గుంటయ్య, యన్.యయ్యాద్రి,కె.భాస్కర్యాదవ్, టి.శ్రీనివాసులు యాదవ్, పలువురు స్థానికులు ఉన్నారు.

# జాతీయస్థాయి కరాటే పోటీల్లో పొదిలి విద్యార్థుల ప్రతిభ



పొదిలి, మేజర్‌న్యూస్: విజయవాడలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కుంఫూ, కరాటే పోటీల్లో పొదిలి విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. కరాటే మాస్టర్ కఠారి చిన్నరాజు వద్ద శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు పలు విభాగాల్లో కట్టాస్, స్పారింగ్లో బంగారు, రజత పతకాలు సాధించారు. స్పారింగ్లో పలు వయస్సుల విభాగాల్లో చిట్టెం షాలూమ్, జోయల్ జశ్వంత్, షేక్ సూఫియా, కరీనా, సుమయా, కట్టాస్లో హన్విక, శ్రీవాత్సల్య, వశిష్ఠ, సిహెచ్ షాలూమ్, వాజితారెడ్డి, షేక్ షాజియా, అబ్దుల్ షహీద్, రాకేష్, మధువిశ్వనాథ్, శశివర్ధన్, చైత్ర బంగారు పతకాలు సాధించారు. కరాటే మాస్టర్ కఠారి చిన్నరాజును నిర్వాహకులు పి.మురళీక్రిష్ణంరాజు, బి.వెంకట్, పి.నాయబ్రసూల్, ఎస్కే దరియావలిలు ఘనంగా సన్మానించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

## ఒంగోలు రూరల్ సిఐగా శ్రీకాంత్ బాబు బాధ్యతలు



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: ఒంగోలు రూరల్ సర్కిల్ సీఐగా ఎన్.శ్రీకాంత్ బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తన పరిధిలోని మద్దిపాడు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు ఎస్ఐలు, సిఐ శ్రీకాంత్ బాబును గౌరవంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో సమావేశమైన సిఐ శ్రీకాంత్ బాబు తన పరిధిలోకి వచ్చే గ్రామాల సమాచారం అడిగి తెలుసుకున్నారు.

# ఆర్యవైశ్య నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం



పొదిలి మేజర్ న్యూస్ : ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య కార్య వర్గ సమావేశంలో ప్రధాన అధ్యక్షులుగా కోట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి ఎ. శ్రీనివాసులు, కోశాధికారిగా వక్కలగడ్డ సురేష్ నియమించారు. ఆదివారం ఒంగోలులో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ మాగుంట శ్రీనివాసరావు, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, మాజీ మంత్రి సిద్ద రాఘవరావు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ పాల్గొన్నారు, నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంకు ఈరోజు పొదిలి నుంచి కార్యదర్శిగా సామి విజయ్ కుమార్, నూనె హేమ సుందరం, కె.వి.కె సత్యనారాయణ, చొక్కా సుబ్రహ్మణ్యం, మునగ వెంకట సాయికుమార్, అధికార ప్రతినిధి ఒగ్గు వెంకటరామయ్య ను నియమించారు, ఈ కార్యక్రమమునకు గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో పొదిలి నుంచి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాసిక శివాజికి జాతీయ సేవా పురస్కారం



చీరాల, మేజర్‌న్యూస్: శ్రీస్వామి వివేకానంద అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ స్వచ్ఛంధ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాసిక శివాజికి జాతీయ అత్యుత్తమ సేవా పురస్కారం దక్కింది. జాతీయ గ్రంథాలయ దినోత్సవం 132వ పద్మశ్రీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఆదివారం తమిళనాడు అన్నా సెంటనరీ లైబ్రరీ ఆడిటోరియంలో మద్రాసు లైబ్రేషన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వ విద్యాలయ ఉపకొతపతి డాక్టర్ ఎం దొర్ల స్వామి, మాల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె నిత్యానందం, స్థానిక ఎమ్మెల్యే జేఎం మౌలానా వారి చేతుల మీదుగా నాసిక శివాజీ పురస్కారాన్ని అందుకున్నారు. వివేకానంద అసోసియేషన్ సంస్థ సెక్రటరీగా, జాండ్రపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా, ఒంగోలు క్విజ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సహాయక గ్రంథపాలకుడిగా ప్రస్తుతం ఒంగోలు రైజ్ కృష్ణ సాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టూషన్‌లో గ్రంథపాలకుడిగా విధులు నిర్వర్తిస్తూ అనేక సేవా కార్యక్రమాలను నాసిక శివాజి నిర్వహిస్తున్నారు. నాసిక శివాజి సేవలను గుర్తించి జాతీయ ఉత్తమ గ్రంథపాలకుడి అవార్డు, గౌరవ డాక్టరేట్ తదితర అవార్డులను పలు సంస్థలు అందజేశాయి. సేవా పురస్కారం అందుకున్న నాసిక శివాజిని రైజ్ కృష్ణ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ సిద్దా వెంకటేశ్వర్లురావు, గౌరవ ఛైర్మన్ ఇస్తారా రంగమన్నార్, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి సుబ్రమణ్యం, డైరెక్టర్ ఏవీ భాస్కర్‌రావు తదితర అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంగా పనిచేయాలి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: గ్రామపంచాయతీల అభివృద్ధికి పంచాయతీ సర్పంచులు అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మండల పరిషత్ ఇఒపీఆర్డీ సుందరరామయ్య సూచించారు. శనివారం రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం సందర్భంగా మండలంలో పలుగ్రామాలలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి వీధిదీపాలు పనితీరు గ్రామస్థులతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలపై చర్చించారు. అదేవిధంగా గ్రామాల విద్యుత్తు దీపాలకు ప్రభుత్వానికి విద్యుత్ చార్జీలు చెల్లింపు విధానం గురించి ప్రజలకు వివరించారు. గ్రామాలలో డంపింగ్ యార్డు నందు తడి, పొడి చెత్త వేరుచేయుట, ఘన వ్యర్థ పదార్థాలు ఉపయోగించుట, ముఖ్యంగా గ్రామాలలో పారిశుద్ధ్యం నిర్వాహణపై పలు సూచనలు చేశారు. రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం ముగించినట్లు ఇఒపీఆర్డీ సుందరరామయ్య తెలిపారు.



## శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

టంగుటూరు, మేజర్‌న్యూస్: శాఖా గ్రంథాలయం టంగుటూరులో ఆదివారం చదవటం నాకిష్టం కార్యక్రమం జరిగినది. పిల్లలందరికి ప్రత్యేకంగా హర్ ఘర్ తిరంగా ఉత్సవాలు ఈనెల 2 నుండి 13వ తేది వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బాగంగా పింగళి వెంకయ్య జాతీయ పతాక రూపకర్త, బళ్లారి రాఘవని స్మరించుకోవటం జరిగింది. పిల్లలు పెద్దలు అందరూ ఈ నెల 13 వరకు జరుగు కార్యక్రమాలలో పాల్గొనాలని గ్రంథాలయ నిర్వాహకుడు గుమ్మడి వర్ధన రాజు కోరారు.

## ద్విచక్ర వాహనం- ఆటో ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు



సంతమాగులూరు, మేజర్ న్యూస్ : మండలంలోని గుంటూరు కర్నూలు జాతీయ రహదారిపై ఆది వారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి బల్లికురవ మండలం కొప్పెరపాలెం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు నరసరావుపేట నుండి కొప్పెరపాలెం వెళుతుండగా వినుకొండ నుండి నరసరావుపేట వైపు వెళ్తున్న ఆటో ఢీకొంది ఈ ఘటనలో కోటేశ్వరరావు గాయాలు కాగా 108 సిబ్బంది నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




## సీఐని కలిసిన జనసేన నాయకులు

చీరాల రూరల్, మేజర్ న్యూస్: జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక ఒకటోపట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జనసైనికులు సీఐ ఎం శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుల సీఐ శ్రీనివాసరావుకు పుష్ప గుచ్ఛం అందజేశారు. సీఐ శ్రీనివాసరావును కల్సిన వారిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్, చిరంజీవి యువత రాష్టట ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు, జనసేన పార్టీ జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ పాలవలస శ్రీనివాస్, రాధ రంగ మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు గోకుల్ కిరణ్ తదితరులున్నారు.

# బడ్జెట్‌లో గొర్రెలు, మేకలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి

**రాష్ట్ర సంఘం కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి - చీరాలలో గొర్రెలు,మేకలు పెంపకం దారుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ**

**ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య**





చీరాల, మేజర్‌న్యూస్: ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో గొర్రెలు, మేకలు పెంపకం దారులకు పదివేల కోట్ల రూపాయలను కేటాయించి ప్రతి పెంపకం దారునికి 50శాతం సబ్సిడీతో రూ.5లక్షల రుణం ఇవ్వాలని గొర్రెలు,మేకలు పెంపకం దారుల రాష్ట్ర సంఘం కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి అన్నారు. పట్టణంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో ఆది వారం ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ఈ మహా సభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరై మాట్లాడారు. గొర్రెలు మేకలు లక్షల్ల నగదుతో కొనుగోలు చేస్తున్నప్పటికీ పెంపకం దారులు వాటికి ఇన్సూరెన్స్ మాత్రం చేయించడం లేదని అన్నారు. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనేక సమస్యలు ఎదుర్కోంటున్నారని అందువల్ల ఇన్సూరెన్స్ ను తప్పనిసరిగా గొర్రెలు మేకలకు చేపించాలని అన్నారు. అదే విధంగా గొర్రెలు, మేకలు పెంపకం దారులకు సంబంధించిన మందులను ప్రభుత్వం ద్వారా అందుబాటులోకి తెస్తామని వారికీ హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ హయాంలో బీసీలందరినీ ఆదుకునేలా ఒక చట్టం తీసుకు వచ్చింది అన్నారు. సమాజాన్ని చైతన్య పరచాలంటే చదువు ఒకటే మార్గమని, పెంపకం దారులు వారి పిల్లలను ఖచ్చితంగా బడులకు పంపించి చదివించాలని కోరారు. ఎలాంటి సమస్య వచ్చినా తాను అన్నివేళలా అండగా ఉంటానని అన్నారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతి రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య,ఎం వసంతరావు, ఎన్.బాబురావు పలువురు మాట్లాడారు.

రాష్ట్రంలో గొర్రెల మేకల పెంపకం దారులు లక్షలాది కుటుంబాలు వృత్తిపై ఆధారపడి బతుకుతున్నాయని వేలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నదని ప్రభుత్వానికి వందలాది కోట్ల రూపాయలు ఈ వృత్తి నుండి ఆదాయం వస్తున్నా ఏ ప్రభుత్వం వచ్చినా వీరు సంక్షేమానికి నిధులు కేటాయింపులు తగినంతగా కేటాయించక పోవడం వలన వృత్తి దారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వర్షాలు సీజన్ ప్రారంభం అయినందున అన్ని గ్రామాలలో మూతి జబ్బులు, కాలు కుంటు వ్యాధులు తగులుతున్నాయని వీటి నివారణ కోసం అన్ని పశువుల హాస్పిటల్‌లో తగినన్ని మందులు అందుబాటులో ఉంచి వైద్యం సౌకర్యం అందించి జీవాలను కాపాడాలని వారు కోరారు. ప్రధానంగా మేత ,నీళ్లు, వైద్యం, ఇన్సూరెన్స్ ,రుణాలు, సమస్యలు ఉన్నాయని వీటిని పరిష్కరించడం ద్వారానే వృత్తి మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రభుత్వం వృత్తి రక్షణ వృత్తిదారుల సంక్షేమ కోసం రాబోయే బడ్జెట్లో 10వేల కోట్లు నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాకాలం సీజన్ మొదలవడంతో రాష్ట్ర వ్యాప్తంగా అంటువ్యాధుల ప్రతి మేకలు మృత్యువాత పడుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధ్యక్షులు బుర్రి ఆంజనేయులు సభ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాపట్ల ఏరియా అధ్యక్షులు మద్దిన శేషు, రైతు సంఘం నాయకులు తల్లపనేని రామారావు,యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు గవిని వెంకటరావు, చీరాల మండల అధ్యక్షులు మసనం వెంకటేశ్వర్లు, సంఘం జిల్లా నాయకులు కడియం మణికంఠ, పలువురు హాజరయ్యారు.

## శ్రీనారాయణస్వామి దేవస్థానంలో విశేషపూజలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీమిట్ట పాలెం నారాయణస్వామి దేవస్థానం నందు ఆదివారం విశేష పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామివారికి దేవస్థానం అర్చకులు యం. సత్యనారాయణశర్మ, యం.ప్రసాదుశర్మ ఆధ్వర్యంలో పంచామృత ఫలాభిషేకం పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారిని ఇతర దేవతామూర్తులను పట్టువస్త్రాలు పూలమాలలతో విశేష అలంకరణ చేసి పూజలను నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆవరణలోని గోశాలలో గోమాతను పూజించి గోపూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులతో కలిసి స్వామివారికి మహానైవేద్యం సమర్పించి పూజలుచేసి కర్పూరహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తదుపరి దేవస్థానంవారి ఆధ్వర్యంలో భక్తులకు భోజనవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో దేవస్థానం వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, అమెరికాలో స్థిరపడిన స్థానికులు కొమ్మినేని రమణయ్య రమాదేవి దంపతులు కుటుంబ సభ్యులు స్థానికులు కొమ్మినేని వెంకటరావు, పలువురు భక్తులు, అర్చక బృందం, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## పెండ్లి రోజున పేదలకు సాయం ఆచరణీయం



చీరాల, మేజర్ న్యూస్: పెండ్లి రోజున వృధాగా ఖర్చులు పెట్టకుండా పేదలకు తమ వంతు సాయం అందజేస్తున్న పోలుదాసు రామకృష్ణ దంపతులు సేవలు ఆచరణీయం అని పలువురు ప్రముఖులు కొనియాడారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పోలుదాసు రామకృష్ణ పెండ్లి రోజు అయినందున వారి దంపతుల చిత్రపటాన్ని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బహుకరించి, పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ, నాగ సాయి, వైష్ణవిల సహకారంతో కోటయ్య అనాధ వృద్ధాశ్రమానికి రెండు బస్తాల బియ్యాన్ని పోలుదాసు రామకృష్ణ అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో గొడవర్తి సుధాకర్‌రావు, గుర్రం బధిరీనాథ్, శీరాం రమేష్, అమరా వీరాంజనేయులు, రమణారావు, నారాయణరావు, పూర్ణచంద్రరావు, చెన్న నారాయణ, బిధిరి తదితర వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ తరగతులు

కొనకనమిట్ల , మేజర్ న్యూస్ :గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళిక పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 14 వరకు స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో శిక్షణ తరగతులు జరుగుతాయని మండల పరిషత్ కార్య పర్యవేక్షకులు షేక్ రహీం తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. పంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు, చెత్త నుంచి సంపద తయారీ పై అవగాహన శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

## సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

### - సిపిఐ జిల్లా ప్రతినిధి డి.శ్రీనివాస్

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేసి ప్రజామన్ననను పొందాలని అలా చేయనిచో ప్రజా వ్యతిరేక ముద్రపడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేవండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పేద మధ్యతరగతి కుటుంబాల ప్రజల అభ్యున్నతి కొరకు విద్యార్థులకు అమ్మకు వందనం ప్రతి గృహిణికి ఆర్థిక అభివృద్ధి కోసం ఆర్థిక చేయూత ప్రతి ఇంటికి గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత ఖచ్చితంగా ఉంది రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పటం వలన ప్రజల నుంచి స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వ మద్దతుదారులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని శ్రీనివాస్ సూచించారు. జిల్లా డివిజన్ నియోజకవర్గం మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటిస్తే ప్రజల అవసరాలను గుర్తించి అందుకు తగువిధంగా ప్రణాళిక సిద్ధం చేసి వారికి అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చేందుకు వీలు కలుగుతుందని అలా చేయకుండా లేనిపోని వాగ్దానాలు చేసి ప్రజలకు దూరం కావద్దని శ్రీనివాస్ హితవు చెప్పారు. రైతులకు వ్యవసాయ అభివృద్ధి కోసం సాగు పెట్టుబడికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాకు జమ చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో కూడా అన్నాక్యాంటీన్లు ఏర్పాటు చేసి పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు అధికార పార్టీ నాయకులు మండల అధికారులు ఆలోచించి అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి శ్రీనివాస్ కోరారు.

## నారాయణ స్వామిని దర్శించుకున్న ఆకుపాటి



పామూరు, మేజర్‌న్యూస్: టిడిపి యువ నాయకులు పట్టణ రెండవ ప్రాదేశికక ఎంపీటీసీ సభ్యులు ఆకు పాటి వెంకటేష్ నారాయణ స్వామి వారి దేవస్థానంలో ప్రతేక పూజలు నిర్వహిం చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థా ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీరుకట్టు రసూల్, గాడి మాలకొండయ్య, గంధం వీరనారాయణ, బండి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## చీమకుర్తిలో భారీ వర్షం




చీమకుర్తి, మేజరన్యూస్: పట్టణంలో ఆదివారం రాత్రి గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మెయిన్ రోడ్‌లో పలుచోట్ల వర్షపు నీరు నిలబడిపోయి ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈ వర్షం రైతులకు ఊరట నిస్తుందని సంతోష వ్యక్తం చేశారు.

# శిథిలావస్థలో పంచాయతీరాజ్ అతిథిగృహంపై వివరణ

## 'సూర్య' కథనానికి స్పందన

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఆదివారం నేటి దినపత్రిక సూర్యలో శిథిలావస్థలో పంచాయతీరాజ్ అతిథిగృహం వార్త ప్రచురణకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు స్థానిక ఎంపిడిఒ రామచంద్రరావు, పంచాయతీరాజ్ జెఇ రామకృష్ణ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పంచాయతీరాజ్ అతిథిభవనం మరమ్మతులు చేయించి ఉపయోగంలో తీసుకు రావడానికి తక్షణ చర్యలు చేపడతామని ఉన్నతాధి కారులకు వివరణ ఇచ్చారు. అదేవిధంగా పంచాయతీ రాజ్ జెఇ జిల్లా అధికారులకు పంచాయతీరాజ్ అతిథిగృహం మరమ్మతులకు అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సమాజంలో జరుగుతున్న వాస్తవాలను వెలికితీసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషిచేస్తున్న 'నేటి దినపత్రిక సూర్య' యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు స్థానికులు అన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన డా.మాదాసి

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ఎడ్లూరుపాడు గ్రామంలో గుణపనేని వారి వివాహం సందర్భంగా ఆదివారం వధువు వరుడిని కొండేపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త డాక్టర్ మాదాసి వెంకయ్య వధూవరులను ఆశీర్వదించారు. ఈయన వెంట ఆ గ్రామ సర్పంచ్ రావి శీను, ఆర్.మాధవ పాల్గొన్నారు.



# ట్రాక్టర్ తగిలి మహిళ మృతి

కొండేపి, మేజర్ న్యూస్: కట్టెల ట్రాక్టర్ తగిలి తాళ్లూరి మరియమ్మ (32) అనే మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని కొండపి-పెద్దకండ్లగుంట గ్రామాల మధ్య ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఎస్సై క్రిష్ణబాజీబాబు కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన ప్రకారం కనిగిరి మండలం పెదారికట్ల గ్రామానికి చెందిన కట్టెల ట్రాక్టర్ కొండపి మండలం ముప్పవరం గ్రామం వెళ్లేందుకు పెద్దకండ్లగుంట గ్రామం మీదుగా కొండపి వస్తున్నాడు. అదే క్రమంలో పెద్దకండ్లగుంట గ్రామానికి చెందిన తంగెళ్ల మరియమ్మ ప్రతి ఆదివారం ఒంగోలులోని ఓచర్చికి వెలుతుంటారు. అదే క్రమంలో ఆదివారం ఉదయాన్నే ఒంగోలు వెళ్లేందుకు కొండపిలో బస్సు ఎక్కటానికి మృతురాలి తండ్రి మక్కెన యలమంద తన ద్విచక్రవాహనంపై కొండపి తీసుకువస్తున్నాడు. అదే సమయంలో వెలుతున్నా కట్టెల ట్రాక్టర్ను దాటుతుండగా కట్టెల ట్రాక్టర్ అజాగ్రత్తతో ట్రాక్టర్ను పక్కకు తిప్పడంతో ద్విచక్రవాహనంపై వస్తున్నా ఇరువురు కట్టెలు తగిలి జారి క్రిందపడ్డారు. ఈ ఘటనలో మరియమ్మ ట్రాక్టర్ వెనుక బాగం టైరు క్రింద పడటంతో ట్రాక్టర్ ట్రక్కు ఆమె పైకి ఎక్కింది. మరియమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి యలమంద పక్కకు పడటంతో చిన్నచిన్న గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలో ఉన్న స్థానికులు పోలీస్ స్టేషన్కు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసినటు ఆయన తెలిపారు.

# కార్పెంటర్లకు వుడ్ కాంప్లెక్స్‌కు స్థలం కేటాయించాలి





పొదిలి, మేజర్‌న్యూస్: విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాస, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామంతపుడి నాగేశ్వరరావు కోరారు. చెక్క పని కార్మికులు తమ హక్కులను పరిరక్షించుకోవాలంటే అందరం ఐక్యతగా నడుచు కోవాలని ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి పిలుపునిచ్చారు. ఆదివారం శివాలయంలో జరిగిన పొదిలి కార్పెంటర్స్ యూనియన్ నూతన ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం తో పునికి పుచ్చుకొని సమాజంతో పాటు మనము కూడా ముందుకు సాగాలని ఆయన కోరారు. జిల్లాలో నడి కూడలైన పొదిలిలో కార్పెంటర్స్ నూతన కార్యవర్గం ఏర్పడటం అభినందతాయకమని అన్నారు. కార్పెంటర్స్ అందరికీ వృత్తి రీత్యా సమస్యలు వస్తే జిల్లా యూనియన్ దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే తమ పరిధిలో అయితే పరిష్కరిస్తామని లేకపోతే సమస్యలను రాష్ట్ర యూనియన్ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా కార్పెంటర్ యూనియన్ అధ్యక్షులు చల్లా కృష్ణమోహన్ మాట్లాడుతూ కార్పెంటర్స్ కి ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పలు తపాలుగా చర్చించామని పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర కార్పెంటర్స్ యూనియన్ కోశాధికారి సంషీర్ మాట్లాడుతూ ఎక్కడికక్కడ కార్పెంటర్స్ ఐక్యతగా ఉంటూ ఉన్న పనులను అందరూ పంచుకొని జీవనం సాగించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఎక్కడో పక్క రాష్ట్రాల నుండి ఇక్కడకు వచ్చి అరకొర పనులను వాళ్లు చేస్తుంటే మనం చేతులు కట్టుకొని చూస్తూ ఊరుకుంటాల్సిన దుస్థితి ఏర్పడిందంటే అందుకు నిదర్శనం మనలో ఐక్యత లేని కారణమైన అని చెప్పవచ్చునన్నారు. ఇప్పటికైనా ఈ పొదిలి పెద్ద పట్టణమని పనులు బాగా ఉంటాయని మీరందరూ ఐక్యంగా కలసి మనం పెట్టుకున్న యూనియన్ను అభివృద్ధి చేసుకుంటూ ప్రతినెలా సమావేశం ఏర్పాటు చేసుకొని ఎదురవుతున్న సమస్యల గూర్చి చర్చించుకుని మన సమస్యలను మనమే పరిష్కరించుకోవచ్చునని అలా కాని పక్షంలో జిల్లా రాష్ట్ర శాఖలకు తెలియపరచినట్లయితే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రామస్వామి హైకోర్టు అడ్వకేట్ పొదిలిలో నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవమని తెలిసి ఆయన ఫోనులో అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుమునుపు గాయత్రీ మాత విశ్వకర్మ భగవానునికి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేశారు. అనంతరంజరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులందరికీ పేరుపేరునా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.నూతన కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షులుగా రాచర్ల వెంకట రాజశేఖర ఉపాధ్యక్షులుగా షేక్ మస్తాన్వలి, సెక్రటరీగా మునగంటి రవి, జాయింట్ సెక్రటరీగా వడ్లమాని నారాయణ, కోశాధికారిగా గుత్తికొండ కళ్యాణ్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు, కోటిలింగాచారి విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి ఫణితపు సుధాకర్ ,జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఈదు మూడి రవి ప్రసాద్ ,వినుకొండ శ్యామల మల్లికార్జున్ , జిల్లా సెక్రటరీ జానీ భాష కొనకల మెట్ల స్వప్న సంఘం అధ్యక్షులు యద్దనపూడి వీం బ్రహ్మం నరసింహచారి , నిమ్మల సూర్యనారాయణ, ఈ కోటయ్య, సన్నమూరి సుబ్బారావు, ఎన్. నాగేశ్వరరావు వంగవోలు చంద్రశేఖర్ , నాయకులు కార్పెంటర్స్ తదితరులున్నారు.

# ఘనంగా మాల మృతవీరుల సంస్మరణ సభ



సంతనూతలపాడు, మేజర్ న్యూస్: మండలంలోని పేర్నమిట్ట అంబేద్కర్ నగర్లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఆశయ సమాజ్ ఆద్వర్యంలో ఆదివారం మాల మృతవీరుల సంస్మరణ సభ ఘనంగా జరిగినది. కార్యక్రమానికి అంబేద్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షులు దండేల కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాల యువసేన వ్యవస్థాపకులు, దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంగళరావు పాల్గొని మాట్లాడుతూ 1997ఆగస్టు 11న ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలు చేపట్టిన సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని చట్ట ప్రకారం నిర్వహిస్తుండగా, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏటువంటి ముందు ఆదేశాలు లేకుండా పోలీసులు కాల్పులు, లాఠీ ఛార్జ్ జరిపిన వలన ఎందరో మాలలు క్షతగాత్రులు అయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో ఇద్దరు మాల ముద్దు బిడ్డలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని దగ్గుబాడు నివాసి అయిన గోపతోటి నారాయణ, అమలాపురం నివాసి అయిన పోనంకి శేషయ్యలు ప్రాణాలు కోల్పోయి అమరులయ్యారన్నారు. మాల మృతవీరుల ఆశయాలు నెరవేర్చే దిశగా మాలలు ముందుకు సాగాలని ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను కాపాడుకోవడానికి జరుగుచున్న పోరాటంలో మాల సంఘాల నాయకులు, కార్యకర్తలు, మాల మేధావులు, మాల విద్యార్థులు, మాల స్త్రీలు పాల్గొనాలన్నారు. ముందుగా మృతువీరులకు జోహార్లు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పేర్నమిట్ట అంబేడ్కర్ యూత్ నూకతోటి మధు, టైలర్ గోపి, వివరం విష్ణు, నూకతోటి పాపారావు, కైలా అనీల్ పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు హెల్పింగ్ హ్యాండ్ చేయూత అభినందనీయం



మార్టూరు, మేజర్‌న్యూస్: వృద్ధ దంపతులకు హెల్పింగ్ హ్యాండ్ చేయూత అభినందనీయం అని అన్నారు. మండల పరిధిలోనే జూనియర్ కాలేజ్ సమీపంలో ఉంటున్న 70 సం బొచ్చ పోలయ్య మరియు వారి భార్య బొచ్చ గురువమ్మ 65సం.ల అనారోగ్యంతో భర్త పోలయ్య పూర్తిగా నడవలేని పరిస్థితితో మంచానికి పరిమితం అయ్యారు. దీంతో భార్య గురవమ్మ భిక్షాటన చేసుకుంటూ భర్తను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా వర్షాకాల ప్రభావంతో జీవనం కష్టంగా మారింది.ఇది గమనించిన హెల్పింగ్ హాండ్స్ మార్టూరు సభ్యులు కమిటీ దృష్టికి తీసుకువచ్చి కమిటీ తరపున ఆదివారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పఠాన్ ఖాదరవలి, కార్యదర్శి గుర్రం శ్రీను, ఉపాధ్యక్షులు కన్నెగంటి శ్రీను, పుట్టా అయ్యప్ప స్వామి, కమిటీ సభ్యులు శిల్పాల కోటేశ్వరరావు, షేక్ హబీబా, పసుమర్తి కరిముల్లా, సిహెచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపయోగంగా చెత్త నుండి సంపద కేంద్రాలు

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: టన్నులు కొద్ది తయారయ్యే చెత్త చెదాలను సమస్యలుగా చూడకుండా ఆదాయ వనరులుగా మార్చాలని ఉద్దేశంతో గత టిడిపి ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువులను తయారుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్తుందని భావించారు. కానీ ఈ ప్రక్రియ నిర్మాణములతోనే నిలిచిపోయింది. మండలంలోని 21 పంచాయతీలో నిర్మాణాల కోసం జనాభా ప్రకారం 6 నుంచి 10 లక్షలు వరకు హెచ్చించి చెట్లు తొట్లు నిర్మించారు చెత్తను సేకరించినందుకు రిక్షాలు కూడా మంజూరయ్యాయి. ఇంతలో ప్రభుత్వం మారి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోలేదు సంపద తయారీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో లక్షల రూపాయలు ప్రభుత్వ నిధులు వృధాగా మారాయి. గ్రామాల్లో ఉత్పత్తి అవుతున్న తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలి వాటి నుండి ఎరువుకు తయారు చేయడం ద్వారా రైతులకు విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధి కోసం వినియోగించాలని ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అంతేకాక గ్రామాల్లో పారిశుధ్యం చేపట్టవచ్చు. 500 మంది జనాభాకు ఒక వ్యక్తిని నియమించి అతనికి దీక్షాన్ని కేటాయించి ప్రతి ఇంటికి తిరిగి యుద్దాల సేకరించాలి. సేకరించిన వాటిని డబ్బింగ్ ఆడుకు తరలించాలి అక్కడ ఏర్పాటు చేసిన గదుల్లో ఎద్దాలను విభజించి శుభ్రపరచాలి. వాటిని వివిధ పద్ధతుల్లో వేరుచేసి ఎరువును తయారు చేసే విక్రయిస్తారు. ఇలా చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛత పరిశుభ్రంగా ఉంటాయని లక్ష్యంతో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు చెత్తను ఎరువుగా మార్చకపోవడంతో పర్యావరణానికి హాని కలిగేలా పంచాయతీ సిబ్బంది ఎక్కడ డెంబింగ్ చేస్తే అక్కడ చెత్తను కాలుస్తున్నారు. ప్రజలు ఎత్త వస్తువులతో పాటు ప్లాస్టిక్ వస్తువులను కూడా వేస్ట్ ఉంటారు. ఇవన్నీ కాల్చడం ద్వారా వాతావరణ కాలుష్యం అవుతుంది. ఈ నేపథ్యంలో టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారులకు వచ్చింది. దీనితో వాటి లక్ష్యాలను ప్రభుత్వం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాలలో విలువలు తయారు చేయాలని వాతావరణ కాలుష్యం నుండి రక్షించాలని పేర్కొంటున్నారు.




## టీజి వెంకటేష్, దామచర్ల జనార్ధన్‌ను మర్యాదపూర్వంగా కలిసిన గునుపూడి భాస్కర్

పొదిలి మేజర్‌న్యూస్: జిల్లాలోని ఎంఆర్ హెచ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన జిల్లా ఆర్యవైశ్య కార్యవర్గ సమావేశంలో మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌ను కలిసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆందోళన

### ఈపురిపాలెం సెంటర్ ముస్లిం మత పెద్దలు బైఠాయింపు

### నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్



బాపట్ల జిల్లా చీరాల, మేజర్‌న్యూస్: రోడ్డు మార్గంలో అడ్డుగా ఉన్న కారును ఎందుకు నిలుపుదల చేసారని అడిగినందుకు నడిరోడ్డులో విద్యార్థిని కత్తులతో అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని ముస్లిం మత పెద్దలు నాయకులు డిమాండ్ చేశారు.చీరాల మండలం ఈపురిపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ ఆరిఫ్ (18) అనే డిగ్రీ విద్యార్థి హత్య కేసు చీరాలలో కలకలం రేపిన సంగతి తెలిసిందే. అయితే ఈ సందర్భంగా ఆదివారం స్థానిక ఈపురిపాలెం సెంటర్లో ముస్లిం పెద్దలు పెద్ద ఎత్తున చేరి ఆందోళనకు దిగారు.మృతుడు తల్లిదండ్రులు సయ్యద్ ఖాదర్ అహ్మద్,సాజీదా లతో కలసి రోడ్లపై బైఠాయించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డు మార్గంలో అడ్డుగా ఉన్న కారును సైడ్ ఇవ్వమని అడిగిన చదువుకునే విద్యార్థులపై నేర చరిత్ర కలిగిన కొందరు యువకులు కారు ఆపి విద్యార్థులతో ఘర్షణ పడి కారులో ఉన్న కత్తులతో నడిరోడ్డు పైనే హత్యకు తెగబడిన వారిని పోలీసులు ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దారుణం అన్నారు.

# శ్రీహర్షిణిలో ప్రారంభమైన క్రీడా సంబరాలు




### ఆటల పోటీలను ప్రారంభించిన చైర్మన్ గోరంట్ల రవికుమార్

ఒంగోలు, మేజర్‌న్యూస్: శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా సంబరాలు ఆదివారం నుండి ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ క్రీడా సంబరాలు మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నారు, ఈ క్రీడా సంబరాలను సంస్థ చైర్మన్ గోరంట్ల రవికుమార్ ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులకు విద్యుతో పాటు, క్రీడలు ఎంతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థిని విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఆయన తెలియజేశారు. అందుకే ఇంటర్మీడియట్ కళాశాలను 13 ఎకరాల సువిశాల ప్రాంగణంలో సొంత భవనాలలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నిర్మించడం జరిగిందని తెలియజేశారు. ఈ క్రీడా సంబరాలలో భాగంగా ఆదివారం నాడు బాలికలకు కోకో, టగీ ఆఫ్ వార్, టెన్నికైట్, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థినులను అభినందించడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు ఓటములను సమదృష్టితో స్వీకరించినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు అని తెలియజేశారు. ఈ క్రీడా పోటీలను మొత్తము జిలాని భాషా ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాదాసు వినోద్, డేవిడ్, ఆనంద్, రవి, రామారావు, నవీన్, సంజయ్, శ్రీహరి, రామారావు ఆధ్వర్యంలో ఎంతో క్రమశిక్షణగా జరిపించడం జరిగినది. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఫెక్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ శివకోటి రెడ్డి, ఆర్కిడ్స్ స్కూలు కరస్పాండెంట్ జీ. అజయ్ కుమార్, శివారెడ్డి, కళాశాల డీన్ దాది ఆంజనేయులు, ప్రిన్సిపాల్ రమేష్, ఎంఎస్ఆర్, కరణం నారాయణ, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు


### ఆర్మ్డ్ రిజర్వ్ విభాగాలను పరిశీలించిన ఎస్పీ ఏఆర్ దామోదర్




ఒంగోలు, మేజర్‌న్యూస్ : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయాన్ని ఆదివారం ఉదయం తనిఖీ చేశారు. కార్యాలయంలో వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది వివరాలు పరిశీలించారు. ఈ క్రమంలో పరేడ్ గ్రౌండ్, ఏఆర్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, ఆయుధగారంలో ఉన్న ఆయుధ సంపత్తి, మోటర్ ట్రాన్స్పోర్ట్ విభాగం, వ్యాయామ్యశాల, సిబ్బంది బ్యారాక్, గార్డ్ రూమ్‌లు తదితర విభాగాలను పరిశీలించి, విభాగాల రికార్డులు నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ పోలీస్ వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికను ఎప్పటికప్పుడు సమర్పించాలని వాహన నిర్వహణ, పనితీరు, కేటాయింపు పట్ల శ్రద్ధ వహించాలని, మున్ముందు కూడా వాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంటి సెక్షన్ సిబ్బందిని ఆదేశించారు. ఆయుధాగారంలో గల వివిధ ఆయుధాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది విరామ సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి విశ్రాంతి తీసుకోవడానికి బ్యారక్ ను మరియు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పలు ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ బీమా నాయక్, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణా రెడ్డి, సీతారామిరెడ్డి, ఆర్ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

# టిడిపిలోకి వైసిపి కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ

### – ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో పార్టీ తీర్థం –




ఒంగోలు, మేజర్‌న్యూస్ : వైసిపి కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ టిడిపిలోకి చేరారు. ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ సమక్షంలో పార్టీలో తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, వారి భర్త బేతంశెట్టి హరిబాబు, మధు, తదితర నాయకులు ఉన్నారు.

# జీవో ఎంఎస్ 117ను రద్దు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలి



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: బహుజన టీచర్స్ అసోసియేషన్ ఒంగోలు డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షులు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 117 రద్దు చేసిన తర్వాతనే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం అధికారంలో రాకముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్నటువంటి జీవో ఎంఎస్ నెంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని తద్వారా ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు కర్ర దేవా సహాయం మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా సర్దుబాటు చేయాలని పని సర్దుబాటు పారదర్శకంగా నిర్వహించాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో ఒంగోలు నగరశాఖ అధ్యక్షులు మిరియాల వెలుకొండయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, జిల్లా నాయకులుకొప్పోలు కిషోర్, పల్లె కృష్ణమూర్తి, కొండమూరి కొండల రాయుడు పి. తిరుపతి స్వామి, చెక్క కోటేశ్వరరావు, నాగ మల్లేశ్వర రావు, షేక్ ఫయాజ్, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కంటి చూపు కోల్పోయిన విద్యార్థికి ఆర్థిక సాయం





పొదిలి, మేజర్‌న్యూస్: పొదిలికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి రామాచారికి స్కూల్లో ఉపాధ్యాయుడు బెత్తంతో కొట్టగా కంటిచూపు కోల్పోయాడు.దీంతో ఆపరేషన్ అవసరమై ఉన్నదని ఇటీవల మీడియాలో రావడం జరిగింది. ఈరోజు ప్రకాశం జిల్లా విశ్వబ్రా హ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి ఆ బాబు ఇంటికి వెళ్లి బాబు యొక్క ఆరోగ్య స్థితిగతు లను ఆరా తీసి కంటి ఆపరేషన్కు అగు ఖర్చులు గురించి తెలుసు కొన్నారు స్థానిక సంఘ నాయకులు సామంతపూడి నాగేశ్వరావు వినుకొండ మల్లికార్జున శ్యామల గారు శ్రద్ధ తీసుకొని బాబు ఆపరేషన్ పూర్తయి ఇంటికి వచ్చేవరకు ఆ ఖర్చులు మొత్తం కూడా ఉపా ధ్యాయుడు భరించే టట్లు తగిన రాజీ ప్రయత్నాలు జరిపి శ్రద్ధ వహించారు.. ఏ విధమైన సహాయం కావాలి అన్న జిల్లా సంఘం అండగా ఉంటుందని అధ్యక్షులు అన్నారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా వెలుగులో తెచ్చిన మన జర్నలిస్ట్ విశ్వనాథం గారికి ధన్యవాదాలు తెలిపారు అధ్యక్షుడితో పాటు వినుకొండ మల్లికా ర్జునరావు . పనిదపు సుధాకర్ దొడ్డోజు విశ్వనాథ చారి.రాజు ఆచారి. సోడా వెంకట సుబ్బారావు ఏలూరి వీర బ్రహ్మాచారి ,నిమ్మకూరు మాల్యాద్రి, స్థానిక సంఘ నాయకులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: విజయవాడ నడిబొడ్డున వున్న స్మృతి వనంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు సంఘ విద్రోహులు రాత్రిపూట విగ్రహంపై దాడి చేసిన దోషులపై ఎస్సీ ఎస్టీ యాక్ట్ పెట్టి కఠినంగా శిక్షిచాలని, ఎస్సీ వర్గీకరణ చేయుట చాలా అమానుషమని, ఇది రాజ్యాంగాన్ని కించిపర్చినట్లే అని కర్లపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చార్వక ,అంబేద్కర్ సేవాసమాఖ్య అధ్యక్షులు,పి. ధనుంజరావు గౌరవ అధ్యక్షులు ఎం. పరమానందకుమార్, కాగిత కోటేశ్వరరావు , విజయరాజు, మాజీ జడ్పీటీసీ గంపుల కన్నయ్య జడ్పీటీసీ, బెజ్జం వెంకటేశ్వర్లు,ఆదాము సర్పంచ్, జి. మీరయ్య ,పేర్లి రాజేష్, యిర్మీయా, ధర్మేంద్ర,కాగిత ఆనందబాబు ఇమ్మానుయేలు,మేకల బిజిలి, జి. వందనం,ఎం.బెనర్జీ, కె పద్మారావు, బి. జీవనజ్యోతి,యారం ఇస్సాక్, ఇస్సాకు, అమీర్ బేగ్ , ఏ.శ్రీనివారెడ్డి యూత్ సభ్యులు పాల్గొని నిరసన తెలియజేశారు.

## రూరల్ సీఐ కె.గంగాధర్ రావు, రూరల్ సర్కిల్ సిఐ బి హరికృష్ణ బాధ్యతలు స్వీకరణ






బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల రూరల్ ప్రాంతంలో శాంతి భద్రతలు పరీ రక్షణకు కట్టుబడి ఉంటానని బాపట్ల రూరల్ సి ఐ గా బాధ్యతలు చేపట్టిన కె. గంగాధరరావు, బాపట్ల రూలర్ సర్కిల్ సిఐ గా బాధ్యతలు చేపట్టిన బి. హరికృష్ణ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ తమకు సహకారం అందించాలని సూచించారు.సీనియర్ అధికారుల సలహాలతో నియోజకవర్గంలో శాంతి భద్రతలు పరిరక్షణ ధ్యేయంగా విధులు నిర్వహిస్తామని ప్రకటించారు. గంజాయి పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. సంఘ విద్రోహ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికడతామన్నరు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తాం,కాలేజీల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

## వి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ఆర్థిక సాయం



కొల్లూరు, మేజర్‌న్యూస్: కొల్లూరు మండల జువ్వ పాలెం గ్రామం కొత్తగూడెంకి చెందిన గాజులేటి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి కుటుంబాన్ని పరామర్శించిన వేములపల్లి రవికిరణ్ గారు వారికి ఆర్థిక సహాయం ఒక లక్ష 1.00000 రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో వేములపల్లి రాఘవేంద్ర,వేములపల్లిరత్న గోపాలరావు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అన్నా రాంబాబు



మార్కాపురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని బచ్చు వారి కళ్యాణ మండపం నందు వెంకట రవి శేఖర్ రెడ్డి ఈశ్వరి కుమార్తె, భూమా బాల నరసింహ రెడ్డి అరుణ కుమారుడు నూతన వధూవరులు అయిన మాధుర్య, అరుణ్ సింహాలను మార్కాపురం వైసీపీ సమనవ్యకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆశీర్వదించారు.

## ప్రతి ఆదివారం యూనిట్లకు సెలవు



చీమకుర్తి, మేజర్‌న్యూస్: గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు సంక్షోభం నుంచి కోల్పోయే వరకు వారంలో ప్రతి ఆదివారం సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు చీమకుర్తి ఏరియా గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఇటీవల చీమకుర్తి మండలం పరిధిలోని యూనిట్ల సంఘాల నేతలు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేర ప్రతి ఆదివారం సెలవు దినముగా పాటిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6:00 వరకు అన్ని యూనిట్లు పని దినాన్ని సెలవు దినంగా పాటిస్తాయి. ఆదివారం ఉదయం యూనియన్ నాయకులు చీమకుర్తి ఏరియా పాలిష్ యూనిట్ లను పరిశీలించారు. ఎవరైనా యూనియన్ నిర్ణయాన్ని అతిక్రమించి యూనిట్లను పనిచేస్తే జరిమానా విధించనున్నట్లు తెలిపారు. పాలిషింగ్ యూనిట్లు సంక్షోభం నుంచి గట్టెక్కేవరకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పకుండా అన్నారు. యూనిటీ యాజమానులు యూనియన్ విజ్ఞప్తిని సహకరించాలన్నారు. కార్యక్రమంలో చీమకుర్తి ఏరియా పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర, జిల్లా ప్రతినిధి కందిమల్ల గంగాధర్ రావు, గౌరవ అధ్యక్షులు గోగినేని నాగయ్య, ఎస్.కె అహమ్మద్ బాషా, గొల్లపూడి కోటేశ్వరరావు, ఎస్.కె.రఫీ, సురేష్, మారం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## కన్నయ్య కుటుంబంకు ఆర్థిక సాయం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: మండల కేంద్రం కర్లపాలెం లైబ్రరీ వెనుక ఉంటున్న సవరం కన్నయ్య చనిపోయారు.జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన శివన్నారాయన కన్నయ్య భౌతిక కాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులకు 5000 ఆర్థికసాయంను అందజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేకాట శిబిరాలపై ఎస్సై శివ బసవరాజు దాడులు



మద్దిపూడి, మేజర్‌న్యూస్: మండలంలోని వైయస్సార్ కాలనీలో ఆదివారం పేకాట శిబిరాలపై ఎస్సై శివ బసవరాజు దాడులు.6 మందిని అరెస్ట్ చేసి వీరి వద్దనుండి 3640 నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై శివ బసవరాజు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది.

## చందోలు బంగాళముఖి అమ్మవారిని దర్శించుకున్న సీఐ హజరత్ బాబు



పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: బాపట్ల సీఐ శ్రీ హజరత్ బాబు నెల్లూరు ట్రాన్స్ఫర్ వెళుతూ ఆదివారం నాడు చందోలు బంగాళముకి అమ్మవారి ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించారు.వారి కుటుంబ సభ్యులందరికీ అమ్మవారి శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్టు ఆలయ నిర్వహణ అధికారి జి నరసింహమూర్తి తెలిపారు.

## పేకాట స్థావరాలపై దాడి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు గిద్దలూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నట్లుగా సీఐ సోమయ్య తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి పది మంది వ్యక్తులను అరె స్టు చేసి అనంతరం వారి వద్ద నుండి 10800 రూ నగదును స్వాధీనం చేసుకు న్నట్లు సీఐ సోమయ్య తెలిపారు ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు సంబం ధించి మీకు ఏదైనా సమాచారం ఉంటే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.